

రాజీ మార్గంలోనే కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - కడప : రాజీ మార్గం ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మొదటి అదనపు జిల్లా జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని డిఎల్ఎస్ఎ భవన్‌లో ఈనెల 29న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ముందస్తు నేషనల్ లోక్ అదాలత్ సమావేశాన్ని ఎంఇఒపి అడ్వకేట్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు. కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు, మరింత సమాచారం కోసం 08562- 258622, 244622 నంబర్లకు ఫోన్ ద్వారా కానీ, kadapa.dcourts.gov.in, dlsakdp @gmail.com ద్వారా కానీ సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్/రాయచోటి/రామాపురం

ఉమ్మడి కడప జిల్లాతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మొదటిసారి ఎమ్మెల్యే గెలిపించిన రాయచోటి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, ఆ ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటుపడతానని తెలిపారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సొంత నియోజకవర్గం రాయచోటి వెళుతూ శనివారం మార్గమధ్యంలో కడప విజయదుర్గ ఆలయాన్ని సందర్శించారు. తొలిసారిగా మంత్రి పదవిని చేపట్టిన ఆయనకు ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలో ఇప్పటికే ఉచిత ప్రయాణం అమలవుతోందన్నారు. మరింత లోతుగా అధ్యయనం చేసి పొరపాట్లకు తావు లేకుండా రాష్ట్రంలో ప్రవేశపెడతామన్నారు. వెలకట్టలేని ఎంతో అభిమానంతో రాయచోటి నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనపై నమ్మకం, విశ్వాసంతో మంత్రి పదవిని కట్టబెట్టారన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని, ప్రజల అభిమానం, విశ్వాసాన్ని రెట్టింపు చేసేలా మంత్రిగా తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల కోసం చేసే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి ఆ దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా అందుతాయనే విశ్వాసాన్ని వెళ్లబుచ్చారు. ముఖ్యమంత్రి సహకారంతో రవాణా, యువజన, క్రీడా శాఖలలో వినూత్నమైన మార్పును తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ముఠా దోపిడీ చేసిన ప్రజాధనాన్ని వడ్డీతో సహా కక్కిస్తామన్నారు. రాష్ట్రాన్ని ఆ పార్టీ నేతలు దోచుకున్నారని విమర్శించారు. వారు ఎక్కడ దాచినా బయటికి తీసుకొస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా ముందుకు వెళ్లడమే తన ఏకైన లక్ష్యమని పేర్కొన్నారు. కడపకు విచ్చేసిన మంత్రికి ప్రజలు విశేష సంఖ్యలో రోడ్డు ఇరువైపులా బారులు తీరి పూలు, బాణాసంచాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వాహకులు దుర్గాప్రసాద్, ఆయన సతీమణి మంత్రి దంపతులకు అమ్మవారి వస్త్రాలను అందజేశారు.



రామాపురంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

'మండిపల్లి'కి అడుగడుగునా నీరాజనం

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా రాయచోటికి వచ్చిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గువ్వలచెరువు ఘాట్ దగ్గర నుంచి ప్రజలు విశేష సంఖ్యలో రోడ్డు ఇరువైపులా బారులు తీరి మంత్రికి ఘన స్వాగతం పలికారు. గువ్వల చెరువులో క్రేన్ ద్వారా భారీ గజమాలతో ప్రజలు స్వాగతించారు. పెద్ద సంఖ్యలో జనం హాజరై డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో గువ్వల చెరువు, కొత్తరోడ్డు, నారాయణపురం, నీలకంఠరావుపేట, రామాపురం, గంగనేరు, కొండవాండ్లపల్లె, చిట్లూరు, బండపల్లె, బిట్స్ కళాశాల, రింగ్ రోడ్డు, మీదుగా రాయచోటి పట్టణంలో భారీ ర్యాలీ ద్వారా మంత్రి పార్టీ కార్యాలయం చేరుకున్నారు. రామాపురం ప్రజలు రెండు భారీ క్రైన్‌ల ద్వారా గజమాలతో మంత్రికి స్వాగతం పలికారు. రోడ్డు కిరువైపులా ప్రజలు ఊరూరా నిలబడి బొకేలు, పూలమాలతో మంత్రికి స్వాగతం పలుకుగా ప్రతి ఒక్కరినీ మంత్రి చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేస్తూ పేరుపేరునా పలకరిస్తూ ప్రజలకు అభివాదం చేశారు.



మంత్రి దంపతులకు వస్త్రాలు అందజేస్తున్న దుర్గాప్రసాద్ దంపతులు

కడపలో సినీ నటి నిధి అగర్వాల్ సందడి

ఎమ్మెల్యే మాధవితో కలిసి జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో సినీనటి, ప్రముఖ హీరోయిన్ నిధి అగర్వాల్ సందడి చేశారు. కడప ఎమ్మెల్యే మాధవితో కలిసి జోస్ ఆలుక్కాస్ నగల షోరూమ్‌ను ప్రారంభించారు. ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జోష్ ఆలుక్కాస్ బంగారు, వజ్రాల షోరూమ్‌ను శనివారం కడప ఎమ్మెల్యే మాధవి, సినీనటి నిధి అగర్వాల్ ప్రారంభించారు. సినీ నటిని చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున షో రూమ్ వద్దకు చేరుకున్నారు. అభిమానులను ఆమె ఆప్యాయతగా పలకరించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. బంగారు, వజ్రాభరణాలను ప్రదర్శించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కడపలో కార్పొరేట్ షో రూములు రావడం సంతోషంగా ఉందన్నారు. వ్యాపారం అభివృద్ధి చెంది మరిన్ని షోరూమ్ లు ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. సినీనటి మాట్లాడుతూ మొదటిసారి కడపకు వచ్చానని తెలిపారు. ప్రజల ఆదరణ మరువలేనని పేర్కొన్నారు. నాణ్యతకు, మన్నికకు పెట్టింది పేరు జోస్ ఆలుక్కాస్ అని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ వర్గీస్ ఆలుక్కా, పాల్ ఆలుక్కా, జాన్ ఆలుక్కాస్ మాట్లాడుతూ షోరూం ప్రారంభం సందర్భంగా రూ.60 వేలు విలువ గల బంగారు ఆభరణాలు వజ్రాల కొనుగోలుపై బంగారు నాణ్యాన్ని అందుకుంటారని, వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై ఏడు శాతం తగ్గింపు వినియోగదారులకు అందిస్తున్నామని చెప్పారు. బంగారు ఆభరణాల తరుగు ఛార్జీలపై 50శాతం తగ్గింపు కూడా ఉందని పేర్కొన్నారు. వివాహ కొనుగోళ్లపై ప్రత్యేక డిస్కౌంట్ లభిస్తాయని తెలిపారు. పాత బంగారానికి ఎక్చేంజ్ చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో తన ఉనికిని పటిష్టం చేసుకుంటుందని చెప్పారు.



షోరూంను ప్రారంభిస్తున్న సినీ నటి నిధి అగర్వాల్, ఎమ్మెల్యే మాధవి



ఆభరణాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవి, సినీ నటి నిధి అగర్వాల్, ఎండిలు

జడ్‌పి చైర్మన్‌గా శారద బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్



కడప జడ్‌పి చైర్మన్‌గా శారద శనివారం బాధ్యతలు స్వీకరించారు. జడ్‌పి చైర్మన్‌గా ఉన్న ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి రాజంపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వైస్ చైర్మన్‌గా ఉన్న శారద పూర్తి స్థాయిలో జడ్‌పి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. రానున్న రోజుల్లో కడప జిల్లా ప్రగతికి చేయూత నిస్తానని ఆమె అన్నారు.

స్కామ్‌లకు మాఫియా డాన్ మోడీ

ప్రజాశక్తి - కడప

దేశవ్యాప్తంగా మోడీ స్కామ్‌లకు మాఫియా డాన్‌గా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలెం హరిప్రసాద్ అన్నారు. శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ తన పేరును స్కాం మోడీ అని మార్చుకోవాలని అన్నారు. మోడీ చేసిన స్కామ్‌లలో ఒకటి ఇవిఎంలు, రెండవది నీట్ పరీక్ష పత్రాలు, మూడవది స్టాక్ మార్కెట్లలో దోపిడీ అని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం వల్ల దేశవ్యాప్తంగా నీట్ విద్యార్థులు దాదాపు 25 లక్షల మంది పరీక్షలు రాస్తే అందులో 63 మందికి దాదాపు 720/720 మార్కులు రావడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. నీట్ పరీక్షలలో పేద బడుగు బలహీన విద్యార్థులకు మోసం చేసి బడా బాబుల విద్యార్థులకు బిజెపి ప్రభుత్వం అమ్ముడు పోయింది అని అన్నారు. మళ్లీ నీట్ పరీక్ష జరపాలని బిజెపి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీగా తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉప అధ్యక్షులు సుషీల్ కుమార్, ఆర్‌టిఐజిల్లా అధ్యక్షులు నరసింహులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -గోపవరం

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రూరల్ కన్వీనర్లు డి. వెంకటేష్, ఇ. రమణ పేర్కొన్నారు. బద్వేల్ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం రూరల్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో భూ కబ్జాదారులు ఇష్టానుసారంగా పెట్రేగిపోతున్నారని వారన్నారు. దీంట్లో ప్రధానంగా అట్లూరు మండలంలో నల్లాయపల్లె పొలంలో 40 సర్వేనెంబర్ లో 445 ఎకరాలు పొలం, గోపవరం మండలంలో రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 1629 లో4. ఎకరాల 50 సెంట్లు, 977 సర్వే నెబర్ 3 ఎకరాలు, బి కోడూరు మండలం కాముకుంట రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 108 లో 3 మూడు ఎకరాలు, 280 ఎకరాలు బద్వేల్ రూరల్ ని. కొత్తపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 1నుంచి 90 వరకు దాదాపు 70 ఎకరాలు ప్రభుత్వ భూమిని అనేకమంది, ఆక్రమించుకొని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దొంగ డిఫారాలు తయారు చేయించుకుని అనుభవంలో పెట్టుకునే వారిపై కేసులు పెట్టాలని, ప్రభుత్వ భూమిలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆ భూములలో సిపిఎం ఆధ్వర్యంలో పేదలందరిని ఐక్యం చేసి భూములను స్వాధీనం చేసుకుని పేదలకు భూములను పంచుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దుర్గమ్మ.సుభద్రమ్మ. రవిచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

యువతకు చైతన్య స్ఫూర్తి శ్రీశ్రీ రచనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

తన రచనలతో సమాజ మార్పుకు శ్రీకారం చుట్టి శ్రామిక వర్గం పై ఆయన రచనలు, యువతను కదిలించే శక్తి ఆయన కవిత్వం, నిత్యం రగిలే నిప్పు కణికలు ఆయన రచనలు అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా స్థానిక నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు ఉత్తేజభరితంగా, సమాజానికి అనునిత్యంగా ఉంటాయని చెప్పారు. శ్రామిక వర్గానికి దగ్గరగా ఆయన రచనలు ఉంటాయన్నారు. ముఖ్యంగా యువతను కదిలించే విధంగా కవిత్వాలుంటాయని తెలిపారు. అందుకే ఆయనను విప్లవ కవి అని కూడా అంటుంటారని చెప్పారు. ఆయన రచనలలో మైలురాయి అయిన మహా ప్రస్థానం చరగని ముద్ర అన్నారు. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను, అనే మాటలు రచనలలో తూటాల లెక్క ఉండేవి అన్నారు. ఆయనను, రచనను ప్రతి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రధానంగా రాష్ట్ర విభజన హామీలు అమలు పరచడంలో నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. 2024 ఎన్నికలలో కేంద్రంలోని బిజెపికి దేశంలో వ్యతిరేక పరిస్థితులు వచ్చాయని పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర హక్కులను, విభజన హామీలు మరిచిన కారణంగా ప్రజలు ఎన్నికలలో చెంపపెట్టు లాగా తీర్పు ఇచ్చారన్నారు. గత ఎన్నికలలో రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమికి కనివేని ఎరుగని రీతిలో భారీ స్థాయిలో సీట్లు ఇచ్చారన్నారు. దేశంలోని ఎన్డీయే కూటమి మన రాష్ట్రంలో ని తెలుగుదేశం పార్టీ పై ఆధార పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా రాష్ట్ర హక్కులైన విభజన హామీలు, ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ, వెనుకబడిన సీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ వంటివి సాధన కోసం కృషి చేయాలని కోరారు. కేంద్రంపై ఆ విధంగా ఒత్తిడి తీసుకురావాలని నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రాజేష్, మహేష్, దర్శన్, హరి, సతీష్ పాల్గొన్నారు.



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కష్టజీవికి కుడిఎడమల నడిచేవాడే కవి

కష్టజీవికి కుడి ఎడమల నడిచేవాడే కవి అని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి అన్నారు. శుక్రవారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో బ్రౌన్ గ్రంథాలయంలో శ్రీ శ్రీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిలేది కదిలించేది మార్చేది మార్పించేది నవకవణానికి కావాలని శ్రీ శ్రీ కోరుకున్నారని అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ శ్రీ కవిత్వం కార్మికులకు మార్చింగ్ బ్యాండ్ లాగా పనిచేస్తుందని అన్నారు. ఆయన సాహిత్యాన్ని మొత్తంగా అధ్యయనం చేశారన్నారు. రాజకీయాలపై ఆయన చెప్పిన విరులు ఈనాటికి సమకాలీనత సంతరించుకున్నాయని అన్నారు. డాక్టర్ పొదిలి నాగరాజు మాట్లాడుతూ శ్రీ శ్రీ కథలు ఎంతో సాహిత్య పరంగా తను రాసిన కవిత్వానికి మరో కోణంలో కథలను ఆవిష్కరించి కష్టజీవుల గురించి ఆయన తన కథల్లో పొందుపరిచారన్నారు. డిటెక్టివ్ పతలు కూడా ఆయన రాశారని అన్నారు.

సమస్యలుంటే తెలియజేయాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ శనివారం కడప నగరంలోని ప్రభుత్వ వసతి గృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి పిల్లలు ఏయే తరగతులను అభ్యసిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు, విద్య విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించాలి అని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్, ఉపాధ్యాయులు, వైద్యులు, పిల్లలు పాల్గొన్నారు.



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలలో ఆప్కాస్ విధానంలో పని చేస్తున్న కార్మిక సమస్యలను పరిష్కరించాలని ఎపి ఆప్కాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆప్కాస్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష 16 వేల మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరికి కనీస వేతనం కూడా అమలు కానీ పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేదని పేర్కొన్నారు. కేవలం 23 శాతం మాత్రమే ఫిట్మెంట్ ఇచ్చి చేతులు దులుపుకొన్న ప్రభుత్వం వైసిపి అని తెలిపారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైన ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలోనే వీరిని కూడా పర్మినెంట్ చేయాలని తెలిపారు. ఆ ప్రక్రియ జరిగే వరకు కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలోనే వంద శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలని పేర్కొన్నారు. వీరికి ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఐదు సంవత్సరాలలో అమలు కాలేదని తెలిపారు. ఈ ప్రభుత్వమైనా ఆప్కాస్ కార్మికులకు, వారి తల్లిదండ్రులకు, పిల్లలకు ఉపయోగపడే వృద్ధాప్య, వికలాంగుల, ఒంటరి మహిళ పింఛను ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల సదుపాయాలను వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అణగారిన వర్గాల ప్రేమికుడు చేగువేరా

ప్రజాశక్తి - బద్వేలు

యువతకు స్ఫూర్తి ప్రదాత రగిలే విప్లవ స్ఫూర్తి చేగువేరా అని డివైఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. చేగువేరా జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం చేగువేరా చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున మాట్లాడుతూ చేగువేరా యువతకు రోల్ మోడల్ అన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించడానికి సిద్ధంగా ఉండు అనే చేగువేరా నినాదం ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా ఒక దిక్సూచిలా నిలబడిందన్నారు. క్యూబా విప్లవం జయప్రదంలో చేగువేరా కీలక పాత్ర వహించారన్నారు. గెరిల్లా తరహా పోరాటంలో దిట్ట అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాడన్నారు. పోరాట యోధుడని, ఆయన స్ఫూర్తితో రాబోవు రోజులలో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యోగం ఉపాధి కల్పన కోసం పోరాడుతామన్నారు. కేంద్రంలో ఏర్పాటు అయిన బిజెపి ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయాలన్నారు. ప్రధానంగా ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ వెనుకబడిన రాయలసీమకు ప్యాకేజీ వంటివి ఇవ్వాలి అన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ కూటమిలో రాష్ట్రంలో ఉన్నటువంటి తెలుగుదేశం ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తున్న తరుణంలో రాష్ట్ర విభజన హామీలు అమలు సాధన కోసం కృషి చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బద్వేల్ రూరల్ అధ్యక్షుడు ఎం ఓబుల్ రెడ్డి, పట్టణ నాయకులు కె. రామకృష్ణ పాల్గొన్నారు.

భూ హక్కుల చట్టాన్ని సమర్ధించడం దారుణం

ప్రజాశక్తి - కడప : వైసిపి అరాచక పాలన భరించలేక రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని భూస్థాపితం చేసినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పులు సరిదిద్దుకునే పనిలో కాకుండా జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మంచిదని, గుడ్డిగా మళ్లీ సమర్థిస్తున్నారని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు సి సుబ్రహ్మణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ అన్నారు. కడప బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు ఏమాత్రం భద్రత లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను నిపుణులు న్యాయవాదులు, రాష్ట్ర ప్రజలు పూర్తిగా వ్యతిరేకించారని పేర్కొన్నారు. జగన్ చేసిన తప్పును సరిదిద్దుకోకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజలకు చాలా మంచి జరుగుతుందని సమర్థించుకోవడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమని వారు విమర్శించారు. అంతకుముందు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండవ సంతకం చేయడం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చంద్రమోహన్ భారత న్యాయవాదుల సంఘం గౌరవ సలహాదారులు నాగ సుబ్బారెడ్డి భారత న్యాయవాదుల సంఘం కడప సిటీ అధ్యక్షులు రామకొండయ్య, న్యాయవాది వెంకట శివ ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ రెడ్డి ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, నాయకులకు అంకుశం, శ్రీనివాసులు, జగన్ నాయక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నీలో
కడప క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప

కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని హోస్కోటి ప్రాంతంలో ఉన్న పద్మావతి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన 51వ బిఆర్‌డిసిఎ జాతీయస్థాయి ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో కడపకు చెందిన క్రీడాకారులు రాణించారు. పవర్ గ్రిడ్‌కు చెందిన వంశిక అండర్-10 బాలికల విభాగంలో 7 రౌండ్లకు 3.5 పాయింట్లు సాధించి ఐదవ స్థానం సాధించి ట్రోఫీని కర్ణాటక రాష్ట్ర చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చిదానంద నుంచి అందుకుంది. ఇదే విభాగంలో మరో క్రీడాకారిని దివ్యాన్ని 3 పాయింట్లు సాధించి ఎనిమిదవ స్థానాన్ని, దీపిక రెండు పాయింట్లు సాధించి 11వ స్థానాన్ని సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో జతిన్ నాలుగు పాయింట్లు, అండర్-12 బాలుర విభాగంలో అభిరామన్ మూడున్నర పాయింట్లు, టాలిన్ మూడు పాయింట్లు చేసినట్లు వైఎస్ఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు.

వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీకి సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - కడప అర్బన్

వికలాంగుల సంక్షేమం, సీనియర్ సిటిజన్స్ వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.వి. కృష్ణ కిషోర్ సేవారత్నం అవార్డు అందుకున్నారు. శనివారం చెన్నైలోని రాజ్ భవన్‌లో తమిళనాడు గవర్నర్ ఎం.ఎన్ రవి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు 850 కృత్రిమ అవయవాలను పంపిణీ చేసినందుకు ఈ అవార్డు వరించింది. పలువురు జిల్లా అధికారులు కృష్ణ కిషోర్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు.



తమిళనాడు గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏడీ కృష్ణ కిషోర్

చుక్కెదురు!

ప్రజా'దృష్టి'

రాష్ట్రంలో తాజాగా కొలువుదీరిన కూటమి సర్కారులో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు చుక్కెదురైంది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏర్పడిన సర్కార్లలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత లభించింది. తాజాగా ఏర్పడిన కూటమి సర్కారులో జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురికావడం గమనార్హం. ఇప్పటి వరకు కడప అసెంబ్లీ స్థానంలో గెలిచిన అభ్యర్థులందరికీ అమాత్యయోగం వరించింది. తాజాగా ఏర్పడిన కూటమి సర్కారులో ఎటువంటి ప్రాధాన్యత లభించకపోవడం టిడిపి శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేసింది. తాజా సార్వత్రిక ఎన్నికల్లో ముగ్గురు సీనియర్ ఎమ్మెల్యేలు, ఇద్దరు కొత్తగా అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పడిన సర్కారులో సీనియర్ ఎమ్మెల్యేలతోపాటు, జూనియర్ ఎమ్మెల్యేలకు ఎటువంటి ప్రాధాన్యత లభించలేదు. సీనియర్ ఎమ్మెల్యేల మధ్య పొసగని రాజకీయ నేపథ్యం వ్యవహారం బెడిసికొట్టింది. ఉమ్మడి కడప జిల్లాను యూనిట్‌గా తీసుకుని అన్నమయ్య జిల్లాలో కొత్తగా అసెంబ్లీకి ఎన్నికైన యువ ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి అమాత్య యోగం వరించింది. టిడిపి నాయకునిగా ఉన్న సమయంలో చోటు చేసుకున్న మదనపల్లి అల్లర్ల కేసులో చురుకుగా స్పందించిన నేపథ్యం మండిపల్లికి అమాత్యపదవి వరించిందనే విశ్లేషణలు ఉన్నాయి. ఉమ్మడి కడప జిల్లా పరిధిలో రాయచోటి ఉండడంతో మంత్రి పదవిని కేటాయించారు. యువ నాయకుడు నారా లోకేష్ ముద్ర ఉండాలనే ఉద్దేశమూ స్పష్టంగా కనిపించింది. కడప జిల్లాకు మంత్రివర్గంలో స్థానం లభించని నేపథ్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు చెందిన టిడిపి శ్రేణుల్లో నిస్తేజం నెలకొంది. 2014-19 టిడిపి హయాంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు కడప జిల్లాలో టిడిపికి ఒక్క స్థానమూ ఇవ్వలేదని పలుమార్లు ప్రస్తావన చేసిన సంగతి తెలిసిందే. తాజా సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లాలో టిడిపిని పెద్దఎత్తున ఆదరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి వర్గంలో ఎటువంటి ప్రాధాన్యత కల్పించకపోవడం గమనార్హం. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ సొంత జిల్లా కావడంతోనే శీతకన్ను వేశారు. రాష్ట్ర మంత్రివర్గ కేటాయింపులో వివక్ష చూపించిన నేపథ్యంలో జిల్లా అభివృద్ధి విషయంలో ఎటువంటి వివక్ష చూపిస్తారోననే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఇటువంటి ఆలోచనకు అవకాశం ఇవ్వడం టిడిపి స్వయం కృతాపరాదమని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



కుర్చీలు, స్టూల్స్, దుప్పట్లు అందజేసిన సి.భూపేష్‌రెడ్డి

ఆస్పత్రి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి దేవగుడి కుటుంబం కట్టుబడి ఉందని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామి రెడ్డి తెలిపారు. స్థానికప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ రఫిక్ భాషాకు శనివారం దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో కుర్చీలు, స్టూల్స్, దుప్పట్లు భూపేష్ సుబ్బరామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ చిన్నాన్న ఆది నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆసుపత్రి సమస్యలు అడిగి తెలుసుకున్నారన్నారు. ఆ మేరకు శనివారం కుర్చీలు, స్టూల్స్, దుప్పట్లు అందజేశామన్నారు. ఎంతో ఆశతో వచ్చిన రోగులకు త్వరగా ఆరోగ్యం కుదుట పడేలా డాక్టర్లు పని చేయాలని కోరారు. డాక్టర్ రఫిక్ భాషా ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డికి, భూపేష్ సుబ్బరామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, జనసేన కో-ఆర్డినేటర్ నల్లబోతుల నాగార్జున, నవనీశ్వరరెడ్డి, అంగడి శివ, కల్లాయి స్వామి, పొన్నతోట శ్రీను, జింకల బాషా, నెమలి రాజారెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రదీప్, శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి గెలుపు.. రాష్ట్రాభివృద్ధికి మలుపు

- టిడిపి మైలవరం మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి నెమలి రాజారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



కూటమి గెలుపు.. రాష్ట్రాభివృద్ధికి మలుపు అని టిడిపి నేత, మైలవరం మండలం క్లస్టర్ ఇన్‌ఛార్జి నెమలి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం రాజారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మన నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీ సమస్యను ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. త్వరలోనే జమ్మలమడుగులో పేదలకు, దూర ప్రాంతాల వారికి అన్న క్యాంటీన్ అందుబాటులోకి రానుందన్నారు. గత పాలనలో నియోజకవర్గం అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పోలేదని తెలిపారు. మన పాలనలో సంక్షేమంతోపాటు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తారన్నారు. పిల్లలు మన రాష్ట్ర రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.



ఎమ్మెల్యే 'పుట్టా' కు శుభాకాంక్షలు చెబుతున్న సర్పంచ్

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

- పెద్దగురవలూరు సర్పంచ్ పాలగిరి రాజేష్‌రెడ్డి


ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను మండల పరిధిలోని పెద్ద గురువలూరు గ్రామ సర్పంచ్ పాలగిరి రాజేష్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిశారు. ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రతి గ్రామాన్ని సందర్శించి గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు పాటుపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండాపురంలో పలు రైళ్లు నిలిపేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రానికి సమీపంలోనున్న ఆర్‌ఎస్ కొండాపురం రైల్వేస్టేషన్లో పలు రైళ్లు నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. ముఖ్యంగా రాయలసీమ, వెంకటాద్రి, ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైల్వేస్టేషన్‌కు సింహాద్రిపురం, ఎల్లనూరు, కొండాపురం మండలాల నుంచి అనేకమంది విద్యార్థులు తిరుపతి, చెన్నై, హైదరాబాదు వంటి నగరాలకు వెళుతుంటారు. ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్ కోర్సులను అభ్యసిస్తున్నారు. హైదరాబాద్, చెన్నై ప్రాంతాల్లో అనేకమంది ఈ ప్రాంతం నుంచి వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కరోనా సమయం నుంచి రైలు స్టాపింగ్ నిలిపివేశారు. దీంతో సుమారు 50 నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రగుంట్ల, తాడిపత్రి రైల్వేస్టేషన్లకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్‌ఎస్ కొండాపురంలో రైళ్లు నిలిపేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అన్నదానం చేస్తున్న భక్తులు

దశరథ మహారాజు గుడి వద్ద అన్నదానం

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి గ్రామం నాగులగట్టుపల్లి, దేవరగట్టుపల్లి మధ్యలో ఉన్న దశరథ మహారాజు గుడి వద్ద శనివారం అన్నదానం చేశారు. నాగలగట్టుపల్లె ప్రభుత్వాసుపత్రిలో టాప్‌డోర్స్‌గా పని చేస్తున్న దేవకీదేవి, భర్త నాగరాజ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మ కర్త రామ సుబ్బయ్య తెలిపారు. కొన్నేళ్ల నుంచి ప్రతి శనివారం అన్నదాన కార్య క్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య, భక్తులు పాల్గొన్నారు. దశరథ మహారాజు స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్నవి.

అనాథాశ్రమంలో అన్నదానం

ముద్దనూరు : వేల్పుచెర్ల గ్రామానికి చెందిన జి.సిద్దయ్య, హర్షిణి కుమార్తె మొదటి పుట్టినరోజు సందర్భంగా శనివారం కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాథాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కూతురు పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేయడం సంతోషంగా ఉందని సిద్దయ్య తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మం, సురేష్, సునీల్, కార్తీక్ మణి, కవేంద్ర, శశి, చిన్ని, బిందు, సోమేశ్వరి, ఈశ్వరమ్మ, కుళాయిప్ప, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రుతు పవనాలు ఆగమనం.. రైతులు సాగుకు సిద్ధం

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

నైరుతి రుతు పవనాలు ముందస్తుగా రావడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. రుతు పవనాల ప్రభావంతో వర్షాలు పడడం, పంట పొలాలు పదునెక్కడంతో పంటల సాగుకు అనుకూలమైంది. ఏరువాక సేద్యాలకు సమయం కూడా ఆసన్నమైంది. 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్న' అనే పాట గుర్తుకు వస్తోంది. తొలకరి చినుకులు రావడంతో ఏరువాక సేద్యాలపై అన్నదాతలు దృష్టి సారించారు. పలుచోట్ల దుక్కులకు ఉపక్రమించారు. ప్రకృతి అనుకూలించి, సకాలంలో వర్షాలు వస్తే అన్నదాతకు అంతకు మించిన ఆనందం మరొకటి ఉండదు. పక్షం రోజుల్లో ఏరువాక పౌర్ణమి రానుంది. ఈ లోపు సేద్యాలు పూర్తిచేసుకుని ఏరువాక పౌర్ణమి పర్వదినంలా జరుపుకోవడం రైతన్నలకు అలవాటు. శ్రావణమాసం, కార్తీక మాసం, మాఘ మాసం వచ్చే పౌర్ణమి తరహాలోనే మృగశిర కార్తెలో వచ్చే పౌర్ణమి ఏరువాక పౌర్ణమి అని పిలుస్తారు. ముఖ్యంగా రైతులు ఈ పౌర్ణమిపై మొగ్గు చూపుతారు. ఇక్కడి నుంచి రైతన్నకు ఆదాయ వ్యయాలు ప్రారంభమవుతాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతుల్లో కూడా ఉత్సాహం కనిపిస్తుంది. వాతావరణం అనుకూలించడంతో అన్నదాతలు క్షణం తీరిక లేకుండా పొలం గట్లవైపు పరుగులు తీస్తున్నారు. ఈ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేయడం పరిపాటి. ఇప్పటికే వ్యవసాయ పరికరాలు కూడా సిద్ధం చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగను ప్రధాన పంటగా భావించేవారు. విపరీతమైన ఖర్చు రావడంతో లాభం లేదనుకున్న రైతులు వేరుశనగ సాగుకు స్వస్తి పలుకుతున్నారు. ఏదో 10 శాతం మంది రైతులు మాత్రమే వేరుశనగ సాగు పట్లమొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా పత్తిసాగుపై రైతుల దృష్టి సారించారు. ఆ మేరకు పత్తి పంట సాగవుతోంది. ప్రభుత్వం కూడా వేరుశనగ సాగు చేసే రైతులకు 40శాతం సబ్సిడీతో రాయితీ విత్తన కాయలను అందజేస్తోంది. కానీ రైతులు మాత్రం 70 నుంచి 80శాతం మంది రైతులు ప్రత్యామ్నాయ పంటలు వైపే మొగ్గు చూపుతున్నారు.

భారమవుతున్న దుక్కిళ్ల ఖర్చులు

చాపాడు : కొంత కాలంగా డీజల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. రవాణాపై డీజల్ ప్రభావం ఎక్కువగా ఉంది. వ్యవసాయంపై కూడా డీజల్ పెరుగుదల ప్రభావం చూపుతోంది. గతంలో లీటర్ డీజల్ ధర రూ.55 ఉన్నప్పుడు ఎకరా సేద్యం చేసేందుకు (ట్రాక్టర్) రూ.400 తీసుకునేవారని, ప్రస్తుతం డీజల్ ధర రూ.99పైగా చేరడంతో ఎకరాకు రూ.800 (ఒక సాలు), 1500(2 సాల్లు)అడుగుతున్నారని రైతులు అంటున్నారు. ప్రభుత్వం గతంలో ఎడాదిలో రెండుమార్లు మాత్రమే డీజల్ ధరలు పెంచేవారని ప్రస్తుతంప్రతి రోజు పెంచుతున్నారని వాహన యజమానులు పేర్కొంటున్నారు. వ్యవసాయ పనులు, మోటర్లకు డీజల్ అవసరం ఉంటుందని, పురుగు మందుల వాడకానికి వినియోగించే పవర్ స్ప్రేయర్లకు పెట్రోల్ అవసరం ఉంటుందని రైతులు తెలిపారు. డీజల్, పెట్రోల్ ధరలకు రెక్కలు రావడంతో వ్యవసాయం భారంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ అవసరాల మేరకు ఇంధనాలను రాయితీ ధరలకు ఇస్తూ ఆదుకోవాలంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రతి పనికి ట్రాక్టర్, డీజల్ మోటర్ల వాడకం పెరిగింది. విత్తన శుద్ధి సమయంలో గాలి మరలకు, ధాన్యం సరఫరా చేపట్టే సమయంలో వాహనాలను తప్పక ఆశ్రయించాల్సి ఉంటుంది. ప్రతి వ్యవసాయ పనికి డీజల్ అవసరం ఉంది. ప్రభుత్వం వ్యవసాయానికి అవసరమయ్యే డీజల్ సరఫరాను తక్కువ ధరకు సరఫరా చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ పనులకు ట్రాక్టర్ వెళ్లాలంటే ప్రస్తుతం వస్తున్న ఖర్చులకు గిట్టుబాటు కావడం లేదని రైతులపై భారం పెట్టాల్సి వస్తోందని యజమానులు పేర్కొంటున్నారు. రైతులు తమకు ఆదాయం రావడం లేదని బాడుగలు తక్కువగా ఇస్తున్నారని ట్రాక్టర్ యజమానులు వాపోతున్నారు.



సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

సమన్వయంతో పనిచేసి మంచి పేరు తేవాలి



మాట్లాడుతున్న టిడిపి మండల పరిశీలకులు రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి నాయకులు అందరూ కలిసికట్టుగా సమన్వయంగా పనిచేసి టిడిపి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆ పార్టీ మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథిగృహంలో డీలర్లు పంపిణీపై నాయకులతో రఘునాథ్ రెడ్డి చర్చించారు. అనంతరం టిడిపి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిందని టిడిపి నాయకులు, కార్యకర్తలుగాని ఎవరు కూడా ఇతరులపై దాడులు చేయరాదన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరించరాదని సూచించారు. ప్రజా సమస్యల పట్ల నాయకులు కలిసికట్టుగా ఉండి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి వాటిని పరిష్కరించినప్పుడే నాయకులను, పార్టీని ఆదరిస్తారని చెప్పారు. పదవులు, డీలర్లు షిఫ్ రాక పోయినా కార్యకర్తలు కృంగిపోరాదన్నారు. డీలర్ షిప్ రాకపోయినా అంత కంటే పెద్ద పదవి కష్ట పడిన కార్యకర్తకు వస్తుందని వివరించారు. అధికారం వచ్చిందనే ఆహకారంతో ఓటర్లు, సామాన్య ప్రజలు, ఆస్తులపై దాడులు చేసి నష్టాన్ని కలిగించరాదని కోరారు. నాయకులు కూడా సమన్వయం పాటిస్తే వేంపల్లెలో మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. ఏజెంట్లుగా కూర్చున వాడు గొప్ప కాదు.. ఓట్లు తెచ్చిన వాడే గొప్ప అవుతాడని చెప్పారు. ఏజెంట్లుగా తాము కూర్చునాం తమకే పదవులు ఇవ్వాలని కోరడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, ఎస్పీ జయరామిరెడ్డి, మహమ్మద్ దర్బార్, జయచంద్రారెడ్డి, బాలస్వామిరెడ్డి, తెలంగాణ వలి, మహమ్మద్ ఇనాయతుల్లా, డాక్టర్ కరీముల్లా, పీరా సాహెబ్, గండి మాజీ దేవస్థానం చైర్మన్ రమణ, రజనీకాంత్ రెడ్డి, పోతిరెడ్డి శివ, వేమకుమార్, డక్కా రమేష్, మడక శ్రీనివాసులు, శేషారెడ్డి, శ్రీరామిరెడ్డి, పివి రమణ, కృష్ణారెడ్డి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమలో హైకోర్టుగాని, హైకోర్టు బెంచ్‌గాని ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1937 నాటి శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టు ఏదో ఒకటి రాయలసీమలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ ఒప్పందాన్ని అనుసరించి 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాడినప్పుడు రాయలసీమలో రాజధానిని, కోస్తాలో హైకోర్టును ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. 1956లో తెలంగాణతో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడినప్పుడు రాజధాని, హైకోర్టు రెండు కూడా హైదరాబాదుకు తరలించినట్లు చెప్పారు. 2014లో రాష్ట్ర విభజన కారణంగా నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో నవ్యాంధ్రప్రదేశ్‌లో రాజధాని, హైకోర్టులలో ఒకటి రాయలసీమలో ఏర్పాటు కావాలని, కానీ అలా జరిగేలేదన్నారు. ఇది చారిత్రాత్మక తప్పిదమన్నారు. రాజధాని, హైకోర్టు రెండు ఒక చోట ఉంటే పరిపాలన సౌలభ్యంగా ఉంటుందని కొందరు వాదించడంలో ఔచిత్యం లేదన్నారు. దేశంలో 28 రాష్ట్రాల్లో హైకోర్టులు ఉన్నాయని చెప్పారు. ఇందులో 12 హైకోర్టులు రాజధాని వెలుపల ఉన్నట్లు చెప్పారు. పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో హైకోర్టు, రాజధాని లక్నోలో హైకోర్టు బెంచ్ ఉందన్నారు. రాయలసీమలో హైకోర్టు లేదా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాలను తులసిరెడ్డి కోరారు.



స్వాతిసాయికి మందులను అందజేస్తున్న మలేరియా అధికారి సిద్దయ్య

రక్త పరీక్షల కిట్లు సరఫరా

ప్రజాశక్తి - వేంపల్లె

ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వైద్య సిబ్బందికి రక్త పరీక్షల కిట్లును సరఫరా చేసినట్లు సబ్ యూనిట్ మలేరియా అధికారి సిద్దయ్య చెప్పారు. శనివారం వేంపల్లె మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు స్వాతి సాయికి పులివెందుల సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య రక్త పరీక్షల కిట్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ ఆదేశాలు మేరకు పులివెందుల సబ్ యూనిట్ పరిధిలోని తాళ్లపల్లె, వేముల, నల్లపురెడ్డిపల్లె, లింగాల, బిదినంచెర్ల, సింహాద్రిపురం, కోవరంగుట్టపల్లె, తొండూరు, సంతకొవ్వురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు పులివెందులలోని నగరిగుట్ట, బాకరాపురం, అర్బన్ హెల్త్ సెంటర్లకు మలేరియా నిర్ధారణ పరీక్షల కిట్లును అందజేసినట్లు చెప్పారు. డెంగీ నిర్ధారణ పరీక్షల కిట్లుతోపాటు దోమల నివారణకు సైపనోత్రిన్, లార్వా నివారణకు అబేట్, బిటిఐ పారాసిటమాల్ మందులను కూడా అందజేసినట్లు తెలిపారు. పది రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ముందుజాగ్రత్త చర్యలుగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా, డెంగీ, లార్వా, దోమలు నివారణ మందులు, రసాయనాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. జ్వరాలు సోకిన వారు ఆశా కార్యకర్తల వద్ద మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డెంగీ నిర్ధారణ పరీక్షలను ఎంఎల్‌హెచ్‌పిలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

'ఉపాధి' అక్రమాలపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట



మాట్లాడుతున్న చంద్రభాస్కర్‌రెడ్డి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని, దీనిపై విచారణ జరిపించాలని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు, ఎంపీటిసి చంద్ర భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఉపాధి హామీకి సంబంధించి పనికి వెళ్లకుండా కూలీలుగా మారి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఖాజీపేట మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు భారీ ఎత్తున చోటుచేసుకున్నాయని తెలిపారు. ఉన్నత అధికారుల విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఉపాధి హామీ పనుల్లో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమయిందన్నారు. వైసిపి నాయకులు తమ అనుచర వర్గానికి ఉపాధి పథకంలో లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు అక్రమ సొమ్మును రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా వ్యర్థాలు

ప్రజాశక్తి - చాపాడు

కడప-కర్నూలు జాతీయ రహదారి ద్వారకానగరం వంక సమీపంలో కోళ్ల వ్యర్థాలు ఇష్టానుసారంగా కుప్పలుగా పడేస్తున్నారు. వీటి నుంచి వచ్చే దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు వాహనాల్లో చికెన్ సెంటర్ వాళ్లు వాటి వ్యర్థ పదార్థాలను వంక సమీపంలో వేస్తున్నారు. క్రమేణా అవి పెద్ద కుప్పలుగా తయార వుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు దుర్వాసనను భరించలేకున్నారు. ప్రస్తుతం పడుతున్న తేలికపాటి వర్షాలకు దుర్వాసన మరింత అధికమని ప్రజలు పేర్కొంటున్నారు. కుందూ నది సమీపంలో కూడా గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థ పదార్థాలను పడేసి వెళుతున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని వంకలు, నదుల వద్ద వ్యర్థ పదార్థాలను పడేయకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా చికెన్ సెంటర్ నిర్వాహకులకు అవగాహన కల్పించి వ్యర్థ పదార్థాలను రోడ్లు వెంబడి వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ద్వారకానగరం సమీపంలో పడేసిన కోళ్ల వ్యర్థాలు



కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

అనుమతుల్లేని కట్టడాలను ఆపాలంటూ వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య కట్టడాలను ఆపాలంటూ శనివారం ఎన్‌డిఎ కూటమి నాయకులు మున్సిపల్ కార్యాయలంలో కమిషనర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా వాణిజ్య కట్టాలను నిర్మిస్తున్న నరసింహ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలను వెంటనే ఆపాలని కోరారు. చిన్న పరిశ్రమల శాఖ నుండి అనుమతులు, కాలుష్య నివారణ మండలి నుండి అనుమతులు కానీ లేకుండా రసాయనాలను (ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్) అధికంగా వినియోగిస్తూ పర్యావరణాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. అంతేకాక ప్రభుత్వానికి రావలసిన జీఎస్టీ, నగర పంచాయతీ రాబడికి గండిపడుతోందని కమిషనర్‌కు వివరించారు. వినతిపత్రంపై స్పందించిన కమిషనర్ వెంటనే నోటీసులు జారీ చేసి నిలుపుదల చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఒ గంగిరెడ్డి, కూటమి నాయకులు నిడుజివ్వి షరీఫ్, రమేష్ రెడ్డి, లాడ్జి అంకిరెడ్డి, శివశంకర్ రెడ్డి, ఇమామ్ సాహెబ్, దానం పాల్గొన్నారు.

రాజీ పడడమే రాజమార్గం

ప్రజాశక్తి - ముద్దనూరు

వివిధ కేసుల్లో ఉన్న వారు కక్ష్యలకు పోకుండా రాజీ పడడమే ఇద్దరికీ రాజ మార్గమని జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి తెలిపారు. మండలంలోని కొత్తపల్లెలో శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో లీగల్ సెల్ అథారిటీ సర్వీసెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలన్నారు. కక్ష్యలకు పోకుండా శాంతంగా ఉండాలన్నారు. ఈనెల 29న జరగనున్న లోక్ అదాలత్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ దస్తగిరి, ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్, డిటి సౌజన్య, సర్పంచ్ అరుణమ్మ, న్యాయ వాదులు పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్య మార్గదర్శి శ్రీశ్రీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



సంప్రదాయ చందోబద్ద కవి త్వాన్ని ధిక్కరించి అభ్యుదయ మార్గంలో కవిత్వాన్ని రాసిన ఆధునిక సాహిత్య మార్గదర్శి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) అని కడప జిల్లా రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనకు నివాళి ఘటిస్తూ పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీశ్రీ మహాప్రస్థానం రచనలతో నూతన ఒరవడిని సృష్టించారని, ఆ కవిత్వం ఎందరికో స్ఫూర్తిదాయకమైందన్నారు. తిక్కన, వేమన, గురజాడలను ప్రజాకవిగా పేర్కొన్న శ్రీశ్రీ ఆధునిక యుగకర్తగా నిలిచిపోయారని తెలిపారు. సినీ పరిశ్రమలో ఎన్నో ఆణిముత్యాల్లాంటి పాటలను అందించి తెలుగు సినిమా ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకుపోయారని కొనియాడారు. ఆధునిక కవిత్వ దశ దిశను మార్చిన శ్రీశ్రీ నేటి కవులకు ప్రాతస్మరణీయుడని ఆయన ప్రకటనలో తెలిపారు.

పూర్వ విద్యార్థులు సిమెంట్ బల్లల వితరణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరపు పదవ తరగతి విద్యార్థులు స్కూల్‌కు 13 సిమెంట్ బల్లలను వితరణ చేశారు. పూర్వ విద్యార్థులు వితరణ చేసిన బల్లలను ప్రధానోపాధ్యాయులు పాఠశాల మైదానంలో ఏర్పాటు చేశారు. ప్రతిరోజు మైదానానికి వచ్చే అనేకమంది వాకర్లు, క్రీడాకారులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకొనుటకు ఎంతో సౌకర్యంగా ఉందని, బల్లలు ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : అనాథ మృతదేహాలను మోయడంతోపాటు పలు సామాజిక కార్యక్రమాలు చేసేందుకు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిర్వాహకులు ముందుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం శ్రీఅమ్మనాన్న వృద్ధాశ్రమంలో నివాసం ఉంటున్న అనాథ వంటేరు నారాయణ (83) అనారోగ్యంతో మృతి చెందడంతో అంతిమ సంస్కారాలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. స్పందించిన ఫౌండేషన్ నిర్వాహకులు హిందూ శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మెన్ లక్షణ్‌మోరే మాట్లాడుతూ శుభ కార్యక్రమాలకే కాకుండా ఇలాంటి అశుభ కార్యక్రమాలకు కూడా చేయూత నివ్వాలన్నారు. వృద్ధాశ్రమంలో సేదదీరుతున్న వారికి సహాయం అందించాలని కోరారు.



అంతిమ సంస్కారంలో పాల్గొన్న సభ్యులు